క్లుప్తంగా

ఉత్సాహంగా కళింగకోమట్ల వన భోజనాలు



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కంచిలి: కార్తీక నవమి సందర్భంగా కంచిలి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కంచిలి కళింగ కోమటి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా ఉసిరిచెట్టు వద్ద నవమి పూజ చేశారు. మహిళలు లలిత, విష్ణు సహస్రనామాలను జపించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

ఇచ్ఛాపురం రూరల్: పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారయ్యేలా బీఎల్‌ఓలు, తహసీల్దార్లు, ఎన్నికల డీటీలు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి, పలాస ఆర్డీఓ ఎస్.భరత్‌నాయక్ అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి తహసీల్దార్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకుల సమావేశమై సలహాలు, సూచనలు అందించారు. సమావేశంలో ఇచ్ఛాపురం, కవిటి తహసీల్దార్లు పి.మీనాదేవి, పి.శేఖర్, ఎన్నికల డీటీ బి.శ్రీహరి, సదాశివుని గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లోనే ఉపాధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న సర్పంచ్ పూడి లక్ష్మణరావు

కవిటి : గ్రామసభ ఆమోదం ద్వారానే ఉపాధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఏపీఓ కడియం భాస్కరరావు అన్నారు. మంగళవారం కవిటి గ్రామ పంచాయతీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3కోట్ల విలువైన 37 ఉపాధి పనులను గుర్తించి ఆమోదించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ వీరభద్రస్వామి, నాయకులు పి.నీలాచలం, పి.జయరావు, బి.రమణ, దుర్యోధన, బి.నాగు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ యశోద

సోంపేట: బారువ బాలుర వసతి గృహంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద అన్నారు. వసతి గృహాన్ని మంగళవారం పరిశీలించారు. బోరు పాడైందని సిబ్బంది తెలియజేయగా.. జెడ్పీ నిధులతో బాగు చేయిస్తామని యశోద హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, నాయకులు బుజ్జి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కమిటీలు



మాట్లాడుతున్న ఏసీడీపీఓ లావణ్య

ఇచ్ఛాపురం: సమాజంలో బాల్యవివాహాలు అరికట్టేందుకు వార్డులు, గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఐసీడీఎస్ ఏసీడీపీఓ లావణ్య అన్నారు. మంగళవారం పురుషోత్తపురం సచివాలయం, 9, 10వ వార్డు సచివాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల పుష్ప, బచ్చు జగన్నాథం, మహిళా పోలీసులు సూర్యకుమారి, ఉషారాణి, సచివాలయ అడ్మిన్లు దయాకర్, విజయలక్ష్మి, ఎంహెచ్‌ఎస్ హెచ్‌ఎం లత, బాలాజీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: మండల కేంద్రంలోని అక్కపు వీధికి చెందిన యువతి కనిపించడం లేదని తండ్రి టెక్కలి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ-2 రమేష్‌బాబు తెలిపారు. ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతోందని వక్తలు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో సచివాలయాల వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి: లక్కివలసలో సంక్షేమ బోర్డును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి



టెక్కలి: చాకిపల్లిలో ప్రచార కిట్లను అందజేస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి, సర్పంచ్‌లు తవిటయ్య, శంకర్



కవిటి: బల్లిపుట్టుగలో జెండా ఆవిష్కరణలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నాయకులు



పలాస: చినంచలలో కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కోటబొమ్మాళి: తర్లిపేటలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు



నందిగాం: హరిదాసుపురంలో పార్టీ జెండా ఎగురవేస్తున్న పేరాడ తిలక్, ఫల్గుణరావు, శ్రీరామమూర్తి, జయరాం, నారాయణమూర్తి



ఇచ్ఛాపురం రూరల్: తులసిగాంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పుష్ప, నర్తు నరేంద్ర



సోంపేట: పాలవలసలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు



కాశీబుగ్గ: 4వ వార్డులో అందిన పథకాల బోర్డు వద్ద వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బి.కృష్ణారావు



వజ్రపుకొత్తూరు: పథకాలను వివరిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రావణి, నేతలు, అధికారులు



ఇచ్ఛాపురం: రత్తకన్న గ్రామంలో సంక్షేమపథకాల బోర్డుని ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి



మందస: కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కంచిలి: డి.జి.పురం సచివాలయంలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీ ఇప్పిలి లోలాక్షి

వైఎస్సార్‌సీపీతోనే మత్స్యకారుల సంక్షేమం



కవిటి: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



సంతబొమ్మాళి: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కవిటి: సముద్రమే తమ సంపదగా భావించి జీవనం సాగిస్తున్న తీరప్రాంత మత్స్యకారుల సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాకారమైందని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కవిటి మండలం ఇద్దివానిపాలెంలో సర్పంచ్ గండుపల్లి రమేష్ అధ్యక్షతన తీరప్రాంత మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ముందుగా సముద్రం ఒడ్డున గంగమ్మతల్లి పూజలు నిర్వహించారు. అనంతరం సభావేదిక వద్ద పవిత్ర సముద్రజలాలతో మత్స్యనారాయణుని పూజించారు. మత్స్యకారుల జీవనశైలిని వివరించేలా జానపద నృత్యరూపక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, కాయ భీమసేన్, బైపల్లి మోహన్, గండుపిల్లి హనుమంతు, బట్టి మాధవరావు, మాదాసోమయ్య, వాసుపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మత్స్యకారులది ప్రత్యేక సంస్కృతి అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మలగాం పంచాయతీ సూరాడవానిపేటలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా మహిళలు గంగమ్మతల్లికి ముర్రాటలు పట్టుకొని గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, సంతబొమ్మాళి మత్స్యకార సంఘం అధ్యక్షుడు సూరాడ వెంకటేష్, మత్స్యకార నాయకులు సూరాడ జోగారావు, లండ రుద్రమూర్తి, జోగి రాములమ్మ, గోపినాద్ బెహరా, లండ చైతన్య, సూరాడ రాజారావు, మైలపిల్లి శ్రీనివాస్ రావు, వంక చిరంజీవి, బట్టి రాజు, రట్టి పెరుమాళ్, అంగ అప్పారావు, బి.సుధాకర్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: విశాఖ అగ్నిప్రమాదంలో బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు న్యాయం చేయాలని పలాస మత్స్యకార ఐక్యవేదిక సభ్యులు కోరారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా పలాస లేబరుకాలనీలో సమావేశం నిర్వహించారు. మత్స్యకార నాయకులు అంబటి ఆనందరావు, చొక్కరి నరహరి, తామాడ తులసి, చొక్కర ఈశ్వరరావు, తర్ర రామారావు, కోనేరు భీమారావు, కావిరి కోదండరావు, లండ రమణ, వంక డిల్లీ, పల్లేటి గణపతి, సింహాచలం, కృష్ణ, రామ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.34 లక్షలతో మంచినీటి బోరు



బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మోహన్‌రెడ్డి

టెక్కలి: మండలంలోని బొప్పాయిపురం పంచాయతీ నీలాపురంలో సుమారు రూ.34 లక్షల వ్యయంతో జల జీవన్ మిషన్ మంచినీటి బోరు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి ఇంటింటికీ కుళాయిలు వేయాలని సిబ్బందికి సూచించారు. అయోధ్యపురం పంచాయతీ దీపావళి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగాది హరి ఆధ్వర్యంలో మంచినీటి బోరు పనులు ప్రారంభించారు.

టీడీపీలో టీడీపీ కార్యకర్తలే చేరడం హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఢిల్లీరావు

వజ్రపుకొత్తూరు: మండల టీడీపీలో వింత పరిస్థితి చోటు చేసుకుంటుందని, టీడీపీ కార్యకర్తలకే తెలుగుదేశం కండువాలు వేసి రెన్యువల్ కార్యక్రమం చేశారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పెద్దబొడ్డపాడు సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పలాస నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌతు శిరీష, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడులు మంగళవారం పెద్దబొడ్డ పంచాయతీలో పర్యటించి టీడీపీ కీర్యకర్తలకే ఆ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి చేరారని చెబుతున్నారని, అందులో వాస్తవం లేదన్నారు. పెద్దబొడ్డపాడు పంచాయతీలో గత ఎన్నికల్లో టీడీపీకి 39 ఓట్లు మాత్రమే పోలైయ్యాయని, ఈసారీ అవి కూడా పడవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.30 లక్షలతో సీతాపురం, కొల్లిపాడు, కూర్మనాథపురం, పెద్దబొడ్డపాడు దత్తత గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్డు, పూడిక తీసే పనులు చేపట్టామని, టీడీపీ హయాంలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేసారు. టీడీపీ నాయకురాలు శిరీషకు మంత్రి సీదిరి అప్పలరాజును విమర్శించే స్థాయి లేదన్నారు. సమావేశంలో పంచాయతీ ఉప సర్పంచ్ డి.గోవిందరావు, పార్టీ అధ్యక్షుడు తమ్మినాన అప్పారావు, సచివాలయ కన్వీనర్ యదళ్ల రాజారావు, గృహ సారథి హనుమంతు అప్పల స్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

మందస: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సత్యసాయిబాబా 98వ జయంతోత్సవాలలో భాగంగా మందసలోని సాయి బృందావన్‌లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలు ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. సామూహిక సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు



పథకాల బుక్‌లెట్ అందిస్తున్న దువ్వాడ వాణి, రాఘవరావు

టెక్కలి: ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. టెక్కలి మండలం తొలుసూరుపల్లి సచివాలయం పరిధిలో తొలుసూరుపల్లి, సైనిక్‌నగర్‌లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, నాయకులు బగాది రామకృష్ణ, చింతాడ అప్పన్న, గూన శ్రీను, నర్సింహమూర్తి, లిమ్మారావు, ధర్మా, డాక్టర్ దువ్వాడ హైందవి, మోహన్, రాహుల్, బి.గోవిందరావు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్!



చెరువులో వేసిన రాళ్లు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. సర్వే నంబర్ 415, 481లో ఎకరా 20 సెంట్లలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేశారు. దానికి అనుకొని ఉన్న లచ్చయ్య ఒడ్డు చెరువు గట్టును జేసీబీతో తొలగించి ట్రాక్టర్‌తో వందల లోడుల ఇనుపరాయి కప్పి కబ్జాచేశారు. దీంతో గ్రామస్తులు పంచాయతీ సెక్రటరీ, వీఆర్వోలకు ఫిర్యాదు చేశారు. దీంతో సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి ట్రాక్టర్లను ఆపే ప్రయత్నం చేసినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ చలమయ్య స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వర స్వామి తిరువీధి



తిరువీధిలో పాల్గొన్న భక్తులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని తిలక్‌నగర్‌లో కాశీవిశ్వేశ్వర స్వామివారి తిరువీధి ముగింపు మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. 17వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కొంచాడ రాజాశ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు సతీమణి శ్రీదేవి కూడా భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు.

అమరవీరులకు జేజేలు



మాట్లాడుతున్న ఏసీడీపీఓ లావణ్య

పలాస: శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన 360 మందిని స్మరిస్తూ ఉద్దానం ప్రాంతంలో మంగళవారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో పలాస మండలం నీలావతి, మాకన్నపల్లి, బొడ్డపాడు, మామిడిపల్లి తదితర గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడు గ్రామంలో బుధవారం అమర వీరుల స్మారక స్థూపం వద్ద స్మారక సభ నిర్వహిస్తున్నామని జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పి.ఓ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పి.కుసుమ, జిల్లా నాయకురాలు కుత్తుం హేమావతి, జడ్డే అప్పయ్య, రాపాక మాధవరావు, బర్ల గోపి, బదకల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం



టెక్కలి: బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్‌కమార్



కాశీబుగ్గ: ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ భరత్ నాయక్, తహశీల్దార్ మధుసూదన్

టెక్కలి/కాశీబుగ్గ/కోటబొమ్మాళి/వజ్రపుకొత్తూరు రూరల్/ఇచ్ఛాపురం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదుకావాలంటూ మంగళవారం టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘విద్వేషాలు రెచ్చగొట్టేలా బీజేపీ పాలన’



విప్లవ జోహార్లు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: దేశ అభివృద్ధిని పక్కన పెట్టి కులాలు, మతాల మధ్య విభేధాలు సృష్టించడమే ఏజెండాగా బీజేపీ పాలన సాగిస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు విమర్శించారు. మర్రిపాడులో మంగళవారం అమరవీరుల స్మరణ కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అందాల కోటేశ్వరరావు, మామిడి భీమారావు, మురిపింటి తాతారావు, వంకల పాపయ్య, మురిపింటి ఎరకమ్మ, బి.కూర్మారావు, రామారావు, కె.కోటేశ్వరరావు, బతకల ఈశ్వరమ్మ, జుత్తు వీరాస్వామి, సన్యాసి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మండపం నిర్మాణానికి నిధులు మంజూరుచేస్తాం

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం దేవాంగులకు సంబంధించి శ్మశానవాటికలో సామాజిక మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారని దేవాంగ సామాజిక కుల పెద్దలు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బల్లిపుట్టుగలో ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ సంతోష్ మండలా, దీనబంధురెడ్డి, కుమారస్వామి, నీలకంఠం, అప్పారావు, కొల్ల కాళిదాసు పాల్గొన్నారు.

విశ్రాంత భవనం నిర్మాణానికి శంకుస్థాపన

కంచిలి: మఠం సరియాపల్లి పంచాయతీ దాలేశ్వరంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.2.5లక్షలతో చేపట్టనున్న ప్రజావిశ్రాంత భవనం నిర్మాణానికి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొణపల సురేష్, వార్డుమెంబర్ బిజయ్ ప్రధాన్, జయరాం ప్రధాన్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహారుద్రాభిషేక వేడుకలు

కంచిలి: కత్తివరంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 24 వరకు మహామృత్యుంజయ అమృత పాశుపతాస్త్ర రుద్రహవన, సహస్రఘట మహారుద్రాభిషేకం వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ నిర్మాణదాతకు సత్కారం

కంచిలి: బెల్లుపడ గ్రామంలో నూతనంగా పునఃప్రతిష్ఠించిన రుక్మిణీ రాధాకృష్ణ ఆలయం నిర్మాణంలో అధిక భాగం ఆర్థిక సాయం చేసిన ఒబినిండి సోమేష్ దంపతులకు గ్రామస్తులు మంగళవారం సత్కరించారు. తాపీమేస్త్రీలు, ఇతర పనులు చేపట్టిన వారిని కూడా సన్మానించారు.

బాలల హక్కుల కమిటీ తనిఖీలు

కవిటి: మండలంలోని వ్యాపార వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, మెకానిక్ వర్క్‌షాప్‌ల్లో బాలల హక్కుల కమిటీ సభ్యులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎంఈఓ ధనంజయమజ్జి, ఎస్‌ఐలు ఎస్.కేశవరావు, కె.రాము, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మట్ట విజయకుమార్ పాల్గొన్నారు.

విరిగిన ఎల్‌సీ గేట్ లాక్

ఇచ్ఛాపురం: రత్తకన్న రోడ్డులోని రైల్వే ఎల్‌సీ గేట్‌ని మంగళవారం ఆటో ఢీకొట్టడంతో లాక్ విరిగిపోయింది. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రైల్వేసిబ్బంది లాక్ సరిచేసి ట్రాఫిక్ చక్కదిద్దారు.

సత్యసాయికి 121 రకాల నైవేద్యాలు



టెక్కలి: సత్యసాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం టెక్కలి రోటరీనగర్‌లోని శాంతి సుధా మందిరంలో 121 రకాల పిండి వంటలతో బాబాకు నైవేద్యం సమర్పించారు. సేవా సమితి కన్వీనర్ చంటి, బాల వికాస్ నిర్వాహకులు బి.అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో భజన నిర్వహించారు.